సాక్షి తిరుపతి

శనివారం | 18 | జనవరి | 2025



ముగ్గురికి యావజ్జీవం

ఓ వ్యక్తిని హతమార్చిన ఘటనలో ముగ్గురికి యావజ్జీవ శిక్ష విధిస్తూ శ్రీకాళహస్తి 12వ జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. - IIలో



సంక్రాంతి వీడ్కోలు

తిరుపతిలో సంక్రాంతి వీడ్కోలు రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు తరలివస్తున్నారు. - IIలో



..జీడిమామిడి తోటలు

సత్యవేడులో జీడిమామిడి తోటలు అంతరించిపోతున్నాయి. అటవీశాఖ నిర్లక్ష్యమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. - IIలో

న్యూస్‌రీల్

గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఆయన కలెక్టరేట్ నుంచి శుక్రవారం జూమ్ మీటింగ్ ద్వారా ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతోపాటు పలువురు అధికారులతో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 26న జరిగే 76వ గణతంత్ర సమావేశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం పూర్తి పర్యవేక్షణ బాధ్యత తిరుపతి ఆర్డీఓ రామమోహన్‌కు అప్పగించామన్నారు. మిగిలిన కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించినట్టు వెల్లడించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో నరసింహులు, కలెక్టరేట్ ఏఓ భారతి పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్ల ఎంపికకు 20 వరకు గడువు

తిరుపతి అర్బన్: సీడాఫ్ వారి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలో పీఎంఎఫ్ఎంఈ అమలుచేయడానికి ప్రతి మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్ ఎంపికను చేపట్టనున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కే.శోభనబాబు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లో రిసోర్స్ పర్సన్‌గా పనిచేయడానికి ఏదైనా డిగ్రీ ఉండాలని, 21 నుంచి 30 ఏళ్ల మధ్య వయసుగల మహిళలు, పురుషులు, ట్రాన్స్‌జెండర్లు అర్హులని పేర్కొన్నారు. తెలుగు భాష, కంప్యూటర్ ఉపయోగించే పరిజ్ఞానంతో పాటు, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను మొబిలైజేషన్ చేయగలిగే సామర్థ్యం ఉండాలని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం లేదా గ్రామీణాభివృద్ధి రంగంలో పనిచేసిన అనుభవం ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 9963561755, 9701387293, 7993502145 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

తాత్కాలిక నియామకాలపై ప్రభుత్వం కన్నెర్ర

తిరుపతి సిటీ : విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా వర్సిటీ అధికారులు చేపట్టిన నియామకాలపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఈ నెల 20వ తేదీలోపు నివేదిక ఇవ్వాలని అన్ని వర్సిటీల వీసీ, రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసింది. గత ఏడాదిలో ప్రభుత్వ అనుమతి లేకుండానే పలు వర్సిటీల్లో తాత్కాలిక ఉద్యోగులను నియమించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఉన్నత విద్యామండలికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 20వతేదీలోపు అన్ని వర్సిటీలు నివేదికలు ఈ మెయిల్ ద్వారా పంపాలని ఆదేశించింది. అలాగే ప్రభుత్వ అనుమతి లేకుండా చేపట్టిన ఆర్థిక లావాదేవీల వివరాలను పంపాలని పేర్కొంది. దీంతో జిల్లాలోని వర్సిటీల్లో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిపిన అధికారుల్లో గుబులు నెలకొంది.

చీరకట్టుతో 'సాగు'తాం!



సత్యవేడు నియోజకవర్గం, కేవీబీపురం మండలం, రాగిగుంటకు చెందిన ఓ రైతు పుచ్చ పంట సాగు చేశాడు. చీడపీడలతోపాటు అడవి పందులు, కోతుల బెడద నుంచి పంటను కాపాడుకోవడం తలనొప్పిగా మారింది. కంచె ఏర్పాటు చేసినా.. కరెంటు పెట్టినా మూగ జీవాల ప్రాణాలమీదికి వస్తున్న నేపథ్యంలో కొత్త ఐడియా వేశాడు. ఇంట్లో ఉన్న పాత చీరలను పొలం చుట్టూ రక్షణ కవచంలా కట్టాడు. ఇవి గాలికి అటూఇటూ ఆడుతూ శబ్దం చేయడంతోపాటు.. రకరకాలుగా కనిపిస్తుండడంతో అటువైపు మూగ జీవాలతో పాటు ఎవరూ వెళ్లడం లేదని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఐడియా అదిరింది కదూ..!

– ఫొటో : మోహన్‌కృష్ణ కేతారి, సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

చిరుత ఉంది జాగ్రత్త!



తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల తరచూ పులి సంచరిస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు ముఖ్యమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కూడలి ప్రాంతాల్లో బ్యానర్లు కట్టారు. విద్యార్థులు, ఉద్యోగులు, పాదచారులు, సందర్శకులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. యూనివర్సిటీ ఆవరణలో వ్యర్థ ఆహారపదార్థాలు వేయరాదని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి 8 నుంచి ఉదయం 7 గంటల వరకు యూనివర్సిటీ రోడ్లపైన సంచరించరాదని హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే తమకు సంబంధం లేదని తేల్చి చెప్పారు.

సాక్షి, ఫొటోగ్రాఫర్, తిరుపతి



నాట్ ఈజీ ..!

- పరిశ్రమల ఏర్పాటుకు అడ్డంకులు ఎన్నో! • రిజిస్ట్రేషన్ నుంచి కనెక్షన్ వరకు ట్రాన్స్‌కో నిర్లక్ష్యం
- జిల్లాలో 54 దరఖాస్తులు పెండింగ్ • ఎల్‌టీ పరిశ్రమలకు 37, హెచ్‌టీకి 17 మంది
- డబ్బులు చెల్లించినా తప్పని ఎదురుచూపులు • కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకటి మాత్రమే రిలీజ్
- కండక్టర్ కొరత వల్లే : ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు

☛ నాయుడుపేటకు సమీపంలో మధ్య తరహా పరిశ్రమ స్థాపనకు శ్రమకోర్చి ఓ యువకుడు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. పరిశ్రమకు సంబంధించి విద్యుత్ కనెక్షన్ కోసం 2017 సెప్టెంబర్ 11న ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీంతో 18న ట్రాన్స్‌కో అధికారులు స్థలాన్ని సందర్శించి, డిమాండ్ నోటీసు ఇచ్చారు. అందులో డెవలప్‌మెంట్ చార్జీల కింద రూ.5,56,800, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.6.96 లక్షలు, ఎస్వీపీ చార్జీల కింద రూ.1,15,960.. మొత్తం రూ.13,68,760 చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇచ్చారు. వాటిని దరఖాస్తుదారుడు 100 శాతం చెల్లించారు.

☛ శ్రీకాళహస్తి సమీపంలో చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటుకు ఓ యువకుడు ముందుకొచ్చాడు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకుని, విద్యుత్ కనెక్షన్ కోసం 2022 ఆగస్టు 16న ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. రూ.93,482 చెల్లించాలని ఎస్టిమేషన వేశారు. అందులో రూ.22,672 దరఖాస్తుదారుడు చెల్లించాడు. అయితే ఇంత వరకు విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. విద్యుద్దీకరణ పనులు ప్రారంభించనే లేదు. అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడలేదు.

☛ సత్యవేడుకు సమీపంలో ఓ భారీ పరిశ్రమను స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్త వివిధ రకాల అనుమతులు పొందాడు. విద్యుత్ కనెక్షన్ కోసం 2023 సెప్టెంబర్ 7న ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అదే ఏడాది డిసెంబర్ 29న డిమాండ్ నోటీసు ఇచ్చారు. డెవలప్‌మెంట్ చార్జీల కింద రూ.9 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.7.50 లక్షలు, సర్వీసు లైన్ చార్జీల కింద రూ.2,17,590 లక్షలు..ఇలా రూ.18,67,590 చెల్లిస్తే విద్యుత్ కనెక్షన్ ఇస్తామని ట్రాన్స్‌కో అధికారులు డిమాండ్ ఇచ్చారు. ఆ మేరకు అతడు ఆ మొత్తం సొమ్ము చెల్లించారు. కానీ ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్ మాత్రం మంజూరు చేయలేదు.

ఇలా.. వీరే కాదు జిల్లా వ్యాప్తంగా పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్లు మంజూరులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానంలో పరిశ్రమల స్థాపనకు అనుమతులు వేగంగా ఇస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు, అధికారులు ప్రకటిస్తున్నా.. అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ పాత విధానం.. మాది స్పీడ్ ఆఫ్ డూయింగ్.. అంటూ పలు వేదికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్ ఆర్భాటంగా ప్రకటిస్తున్నా ఆచరణలో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నంగా ఉంది. నెలలు కాదు.. ఏళ్ల తరబడి అనుమతుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. పరిశ్రమల ఏర్పాటులో కీలకమైన ట్రాన్స్‌కో శాఖలో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. పర్యవేక్షణ లోపం, విద్యుత్ పరికరాలను అందుబాటులో ఉంచుకోవడంలో నిర్లక్ష్యం.. వర్క్ పూర్తి చేసేందుకు అధిక కమీషన్లు వసూలు వంటి ఎన్నెన్నో అవరోధాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పాలిట శాపంగా మారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

- తిరుపతి రూరల్

ఈజ్ కాదు...స్పీడ్ ఆఫ్ బిజినెస్

పరిశ్రమలకు అనుకూలమైన విధానాలను ప్రోత్సహిస్తూనే వ్యాపారాల స్థాపనకు పట్టే సమయాన్ని నిర్విరామంగా వేగవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని, ఇందుకోసం గతంలో పేర్కొన్నట్లు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ నినాదం అంటూ కొత్త ప్రభుత్వం ఊదరగొట్టింది. ప్రస్తుతం ఏపీలో పెట్టుబడులు పెట్టే వ్యాపారవేత్తలు ఇకపై ఫాలోఅప్‌ను కొనసాగించాల్సిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న నాటి నుంచి ప్రత్యేక ప్రణాళికతో వారికి యుద్ధప్రాతిపదికన అనుమతులు ఇస్తామంటూ చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదనేది ఔత్సాహికులు ఎదుర్కొంటున్న పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి

జిల్లాలో 54 దరఖాస్తులు పెండింగ్!

ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ పరిధిలో జనవరి 7వ తేదీ వరకు వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని, విద్యుత్ కనెక్షన్ కావాలని 54 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయి. వీటిలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి 37, భారీ పరిశ్రమలకు చెందిన 17 దరఖాస్తులు వచ్చాయి. ఆ దరఖాస్తులను ట్రాన్స్‌కో అధికారులు సైట్ విజిట్ చేసి, అన్ని అంశాలను పరిశీలించి, కనెక్షన్ ఇవ్వడానికి 54 దరఖాస్తులు అర్హత కలిగినవిగా నిర్ధారించారు. అన్నింటికీ డిమాండ్ నోటీసులిచ్చారు.

లక్షలకు లక్షలు చెల్లించినా!

ఎల్‌టీ, హెచ్‌టీ పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్లను ఇచ్చేందుకు ట్రాన్స్‌కో అధికారులు జారీ చేసిన డిమాండ్ నోటీసులకు అనుగుణంగా లక్షలకు లక్షలు చెల్లించినా కనెక్షన్లు మాత్రం ఇవ్వడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌టీ పరిశ్రమలకు సంబంధించి 15 మంది, హెచ్‌టీ పరిశ్రమలకు సంబంధించి 14 మంది డబ్బులు చెల్లించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చిన పాపానపోలేదనే విమర్శలొస్తున్నాయి. ఒక్క డబ్బులు చెల్లించిన వాటిలో ఒక ఎల్‌టీ సర్వీసుకు మాత్రమే కనెక్షన్ ఇచ్చారు. హెచ్‌టీ కనెక్షన్ మాత్రం ఒక్కటీ కూడా ఇవ్వలేదు. 28 మంది సర్వీసు కోసం ఎదురు చూపులు తప్పడం లేదని పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు గగ్గోలు పెడుతున్నారు. కోట్లాది రూపాయలతో పెట్టిన పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్ల కోసం ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నామని వాపోతున్నారు.

కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించినా స్పీడు నిల్

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పరిశ్రమల ఏర్పాటు, వారికి అనుమతులు, వాటిలో సౌకర్యాల కల్పన..వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతి నెల ప్రత్యేకంగా సమీక్షిస్తుంటారు. పరిశ్రమలు, ట్రాన్స్‌కో, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, పొల్యూషన్ బోర్డు...ఇలా జిల్లా స్థాయి అధికారులు అందరూ సమావేశంలో పాల్గొంటారు. అయితే నెల నెలా కలెక్టరే సమీక్షిస్తున్నా అధికారుల తీరులో మాత్రం మార్పు రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా అనుమతులు వచ్చినా విద్యుత్ కనెక్షన్ మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుందని పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కలెక్టర్‌కు సైతం ఇప్పటికే ఫిర్యాదు చేశారు.

కండక్టర్ కొరత

ఇదిలా ఉంటే డబ్బులు చెల్లించినా విద్యుత్ కనెక్షన్లు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉండటానికి కండక్టర్ కారణమని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కండక్టర్ కొరత ఎక్కువగా ఉందని, డిస్కం అధికారులు దానిపై శ్రద్ధ పెట్టకపోవడం, సర్కిల్‌పై పెనుప్రభావం చూపుతోందని తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కనెక్షన్ ఇవ్వాలంటే లైన్లు వేయాలని, స్తంభాలు నాటాలని, కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు వంటి ఎన్నో అంశాలను పరిశీలించి, ముందుకు సాగాల్సి ఉంటుందని చిట్టా చెబుతున్నారు. కండక్టర్ ఇప్పుడిప్పుడే వస్తుందని, డబ్బులు చెల్లించిన సర్వీసులకు పనులు ప్రారంభిస్తామని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు.

నేటి నుంచి విహంగామా!

- ఫ్లెమింగో ఫెస్టివల్స్‌కు సర్వం సిద్ధం
- మేము రెడీ.. మీరు రెడీనా అంటున్న విదేశీ విహంగాలు!



పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలు

సూళ్లూరుపేట: ఫ్లెమింగో ఫెస్టివల్‌కు మేము సిద్ధం. మమ్మలను చూసి తరించేందుకు సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేయండి' అంటూ పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల రక్షితకేంద్రంలోని విదేశీ వలస విహంగాలు జిల్లాలోని పర్యాటకులను ఆహ్వనం పలుకుతున్నట్టు ఆకట్టుకుంటున్నాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో శనివారం నుంచి మూడు రోజులుపాటు నిర్వహించబోయే ఫ్లెమింగో ఫెస్టివల్స్‌కు సర్వం సిద్ధమైంది. పులికాట్ సరస్సులో నీళ్లు సమృద్ధిగా ఉండడంతో ఫ్లెమింగోలు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. చిలువలు, సముద్రపు పావురాళ్లు వేల సంఖ్యలో విడిది చేస్తున్నాయి. ఎర్ర కాళ్ల కొంగలు, నారాయణ పక్షులతోపాటు వివిధ రకాల విదేశీ వలస విహంగాలు విడిది చేసి ఉన్నాయి. నేలపట్టులో సంతానోత్పత్తి చేసుకుంటున్న పెలికాన్స్, ఓపెన్ బిల్‌స్టార్క్స్ లాంటి పక్షులు పులికాట్ సరస్సుపై ఆహారవేటలో సందడి చేస్తున్నాయి. నేలపట్టులో గూడబాతులు, నత్తగుల్ల కొంగలు, నీటికాకులు, తెల్లకంకణాయిలు, శబరికొంగలు లాంటి పక్షులు పొదుగులో ఉన్నాయి.



1,17,216 విదేశీ విహంగాలు

ఇక్కడకొచ్చే విదేశీ వలస పక్షుల్లో అతి అందమైన పక్షి ఫ్లెమింగో కావడంతో ఆ పక్షి పేరుతో పండుగను నిర్వహిస్తున్నారు. పులికాట్ సరస్సు, నేలపట్టులో కలిపి సుమారు 1,17,216 లక్షల స్వదేశీ, విదేశీ వలస విహంగాలు విచ్చేసి ఉన్నట్టు పులికాట్ వన్యప్రాణి సంరక్షణాధికారులు వెల్లడించారు. ఈ పండుగలో నేలపట్టులో పక్షుల సందర్శన, తడ మండలం భీములవారిపాళెం పడవల రేవు వద్ద ఏర్పాటు చేసిన బోట్ షికార్ హైలెట్‌గా నిలవనున్నాయి.

ఎర్రకాళ్ల కొంగల కేంద్రం వెదురుపట్టు, శ్రీహరికోట

ఎర్రకాళ్ల కొంగలు (పెయింటెడ్‌స్టార్క్స్) పక్షులు వెదురుపట్టు చెరువులో, శ్రీహరికోటలోని బేరిపేట ప్రాంతంలో గూళ్లుకట్టుకుని నివాసం ఉంటున్నాయి. ఈ ఏడాది 2,616 పక్షులు వచ్చాయని వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు. రాత్రి గూటికి వెళ్లి తిరిగి వేకువ జాము నుంచి సరస్సుపై ఆహారం కోసం విహరిస్తున్నప్పుడు అవి చేసే విన్యాసాలు ప్రకతి ప్రియులను పులకింపజేస్తుంటాయి.

మరో సంక్రాంతి తరహాలో ఫ్లెమింగో పండుగ

ఫ్లెమింగో ఫెస్టివల్–2025ను మరో సంక్రాంతి పండుగ తరహాలో జరుపుకోవడానికి ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపు ఇచ్చారు. ఫ్లెమింగో ఫెస్టివల్స్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞానకేంద్రం, పులికాట్ సరస్సులో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

బీవీపాళెంపై సవతి తల్లి ప్రేమ

తడ: పక్షుల పండుగ హడావుడి అంతా కూటమిలోని చోటామోటా నాయకుల గొప్పతనాలు చూపేందుకు అనువైన సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంవద్దే కనిపిస్తూ ఉంది. ప్రకృతి ప్రేమికులు ఆనందంగాగడిపే బీవీపాళెం పడవల రేవులో ఏర్పాట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక్కడ నామమాత్రంగా ఏర్పాట్లు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది.

ఏర్పాట్లు పూర్తి

దొరవారిసత్రం: సూళ్లూరుపేట కేంద్రంగా నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే పక్షుల పండుగ(ఫ్లెమింగో ఫెస్టివల్)కు నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం సిద్ధమైంది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్షుల పండుగ పత్యేక అధికారి, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు. క్యాటీన్ అభివృద్ధి వంటి పనులు చేపట్టినట్లు స్థానిక ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ సౌజన్య తెలిపారు. అన్ని వసతులు కల్పించినట్టు తహసీల్దార్ శైలకుమారి పేర్కొన్నారు. తాగు నీటి వసతి ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ తెలిపారు. కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నట్లు నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.



సందర్శకులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నేలపట్టు పక్షుల కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. అనంతరం పక్షుల కేంద్రంలో విడిది చేసే విహంగాలను సందర్శించారు.

ముగిసిన ఏటి పండగ ఉత్సవాలు



స్వర్ణముఖి నది వద్ద జనం కోలాహలం



సాంస్కృతిక కార్యక్రమాలు

నాయుడుపేట టౌన్: సంక్రాంతిని పురస్కరించుకుని నాయుడుపేట స్వర్ణముఖి నదీ తీరంలో ఏర్పాటు చేసిన ఏటి పండుగ ఉత్సవాలు శుక్రవారంతో ఆహ్లాదకరంగా ముగిశాయి. ఏటి పండగ చివరి రోజున నాయుడుపేట మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది స్వర్ణముఖి నది వద్దకు చేరుకున్నారు. మూడు రోజుల పాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ పాలక వర్గ సభ్యులు, నాయకులు సారథ్యంలో ఉత్సవాలను ఆట్టహాసంగా నిర్వహించినట్టు కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఈ వేడుకల్లో ముస్లింలు సైతం పాల్గొని మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఏటి పండుగ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుతున్నాయి. శుక్రవారం రాత్రి నిస్సీ ఈవెంట్ ఆర్గనైజర్ మేర్లపాక హరి ఆధ్వర్యంలో పలువురు బుల్లి తెర నటులు, యువకులతో చేసిన నృత్యాలు ఆకర్షణీయంగా నిలిచాయి.



ఏటి పండుగకు హాజరైన ప్రజలు

క్లుప్తంగా

మహిళా వర్సిటీకి అరుదైన గౌరవం



ఫోర్‌స్టార్ రేటింగ్ సర్టిఫికెట్‌తో వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీకి అరుదైన గౌరవం దక్కింది. దేశంలోని పలు వర్సిటీల పరిధిలో 5,455 ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) కేంద్రాలు నడుస్తున్నాయి. వాటిలో 205 కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఫోర్ స్టార్ గుర్తింపునిచ్చింది. వాటిలో తిరుపతి పద్మావతీ మహిళా వర్సిటీలోని ఐఐసీ సెంటర్ కూడా ఉంది. ఈ క్రమంలో వీసీ వి.ఉమ శుక్రవారం ఫోర్ స్టార్ గుర్తింపు కోసం శ్రమించిన అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. ఆమె మాట్లాడుతూ వర్సిటీలో జాతీయ స్టార్టప్ పాలసీలను అద్భుతంగా అమలు చేస్తున్నామన్నారు. టీబీఐ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా 25 నూతన స్టార్టప్‌లకు నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. అందువల్లే వర్సిటీలోని ఐఐసీకి అరుదైన గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ రజిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

ఎస్వీయూకు అంబులెన్స్ వితరణ



అంబులెన్స్ తాళాలను వీసీ, రిజిస్ట్రార్‌కు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.27 లక్షల విలువ చేసే అంబులెన్స్ వాహనాన్ని వితరణగా అందించింది. శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్వీయూ శాఖ అధునాతన సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు బ్యాంక్ అధికారులు అందజేశారు. వర్సిటీలో ప్రస్తుతం ఉన్న అంబులెన్స్ నిరుపయోగంగా మూలన పడడంతో వీసీ, రిజిస్ట్రార్ల అభ్యర్థన మేరకు వర్సిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫీసర్లు, వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ నాగేష్ పాల్గొన్నారు.

3న ఉచిత సామూహిక అక్షరాభ్యాసం

తిరుపతి కల్చరల్: వసంత పంచమిని పురస్కరించుకొని శ్రీకోదండరామాలయం దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఫిబ్రవరి 3వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పిల్లలకు ఉచిత సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావు తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు సరస్వతీ క్షేత్రం బాసర నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కుంకుమ, అక్షింతలు, సరస్వతి అమ్మవారి కంకణాలు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఫిబ్రవరి 2వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

అంతరించిపోతున్న జీడి మామిడి తోటలు

గుంటూరు అనగానే మిర్చి.. తాడేపల్లిగూడెం పేరు వినగానే బెల్లం గుర్తుకొచ్చినట్లు సత్యవేడు పేరు వినబడిందంటే జీడిమామిడి పండ్లు గుర్తుకొస్తాయి. అంతటి పేరు తెచ్చిన జీడిమామిడి ఇప్పుడు సత్యవేడు ప్రాంతంలో అంతరించిపోయింది. ఇది కేవలం అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యమే అని చర్చ జరుగుతోంది. పండ్ల తోటల్లో ఒకటైన జీడిమామిడిపై అశ్రద్ధ చూపడం పట్ల స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సత్యవేడు మండలం, వానెల్లూరు ప్రాంతంలో ఉన్న జీడిమామిడి తోటలు

- అటవీశాఖ అశ్రద్ధతో సాగుకు దూరమైన అన్నదాతలు
- తైలం చెట్ల పెంపకంపై మొగ్గు
- సత్యవేడులో ఇదీ పరిస్థితి



సత్యవేడు ఏపీఎఫ్‌డీసీ డివిజన్ పరిధిలో ఉన్న అటవీ భూవిస్తీర్ణం చిత్రపటం

వరదయ్యపాళెం: సత్యవేడు, వరదయ్యపాళెం పరిసర ప్రాంతాల్లో ఒకప్పుడు జీడిమామిడి తోటలు విరివిగా ఉండేవి. సీజన్‌లో ఈ తోట ద్వారా వచ్చే జీడిమామిడి పండ్లు చెన్నై, తిరుపతి, నెల్లూరు ప్రాంతాల్లోని పండ్ల మార్కెట్లకు పెద్ద ఎత్తున ఎగుమతి చేసేవారు. అంతేగాక పండ్లతో పాటు వచ్చే జీడిపప్పు గింజలకు చాలా గిరాకీ ఉండేది. తద్వారా బయట ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు ఎగబడి మరీ జీడిమామిడి గింజలను కొనుగోలు చేసేవారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన జీడిమామిడి పంట నేడు సత్యవేడు ప్రాంతంలో అంతరించిపోయింది.

1975 నుంచి సాగు

సత్యవేడు డివిజన్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో జీడిమామిడి పంట 5,400 హెక్టార్లలో సాగయ్యేది. ఈ తోటలను సైతం వారే పర్యవేక్షించేవారు. కాపు వచ్చే సమయంలో ప్రతి ఏడాదీ బహిరంగ వేలం ద్వారా రైతులకు, వ్యాపారులకు పంటను అప్పగించేవారు. ఏడాదికి రూ.కోటికి పైగా ఏపీఎఫ్‌డీసీకి ఆదాయం వచ్చేది. కూలీలకు సైతం చేతినిండా పని లభించేది. అంతేకాక వ్యాపారులకు ఈ పంట లాభాలు తెచ్చిపెట్టింది. ఇలా పదేళ్లపాటు అన్నీ సక్రమంగా జరిగాయి. తదుపరి పరిస్థితులు ప్రతికూలించడంతో ఆదాయం తగ్గుముఖం పట్టింది. ఈ పరిస్థితుల్లో ఏపీఎఫ్‌డీసీ సంస్థకు తోటల నిర్వహణ భారంగా మారింది. దీంతో ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేసినట్లు ఆ సంస్థ చెబుతోంది. అయితే అదే పంటను ఆదాయ మార్గంలో తెచ్చేందుకు ఆ శాఖ అధికారులు ఆలోచన చేయలేదు. ప్రస్తుతం ఈ పంట సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల పరిధిలో 500 హెక్టార్లకే పరిమితమైంది. మిగిలిన చోట్ల జీడిమామిడి తోటలకు బదులు తైలం తోటలను సాగుచేస్తున్నారు.



సత్యవేడులోని ఏపీఎఫ్‌డీసీ కార్యాలయం

జీడిమామిడి తోటల పెంపకం జరిగే ప్రాంతాలు..

సత్యవేడు అటవీ అభివృద్ధి సంస్థ డివిజన్ పరిధిలో ఐదు వేల పైచిలుక హెక్టార్లలో జీడిమామిడి తోటలు నిర్వహణ జరిగేది. ప్రధానంగా ఈ ప్రాంతంలో జీడిమామిడి తోటల విస్తరణతోనే సత్యవేడులో ఏపీఎఫ్‌డీసీ డివిజన్ కార్యాలయం సైతం ఏర్పాటైంది. ఆ మేరకు డివిజన్ పరిధిలోని అడవికండ్రిగ, అరుదూరు, రాచర్ల, చిలమత్తూరు, వానెల్లూరు, కొత్తమారికుప్పం, అంజూరు, ఆంబాకం, టీపీపాళెం, రాజులకండ్రిగ, రాజుగుంట, సత్యవేడు, ఓబులరాజుకండ్రిగ, కాంబాకం, బత్తవల్లం ప్రాంతాల్లో జీడిమామిడి తోటలు సాగయ్యేవి. ప్రస్తుతం ఈ తోటలు కాస్త కొత్తమారికుప్పం, రాజులకండ్రిగ, రాజుగుంట, బత్తలవల్లం, కాంబాకం గ్రామాలకే పరిమితమయ్యాయి.

అంచెలంచెలుగా తొలగింపు



సత్యవేడు ఏపీఎఫ్‌డీసీ పరిధిలో 1997 నుంచి అంచెలంచెలుగా జీడిమామిడి తోటలను తొలగించారు. అందుకు ప్రధాన కారణం ఆ తోటల నుంచి దిగుబడి తగ్గుముఖం పట్టడం, ఆశించిన స్థాయిలో ఈ ప్రాంతంలో పంట రాకపోవడం తదితర కారణాలు ఉన్నాయి. 1997 నుంచి నాటు జామాయిల్ (తైలం) కు ప్రత్యామ్నాయంగా యూకలిప్టస్, క్లోన్స్ అందుబాటులోకి రావడం జరిగింది. తద్వారా ఈ రకం తైలం చెట్లను ఈ ప్రాంతంలో నాటడంతో ఆరేళ్లకు ఓసారి కటింగ్ అవ్వడం జరుగుతోంది. తద్వారా సమీపంలోని తమిళనాడులో ఓ పరిశ్రమ, శ్రీకాళహస్తి సమీపంలోని మరో పరిశ్రమకు యూకలిప్టస్ కొయ్య సరఫరా చేస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధికి అండగా నిలుస్తున్నాం. ప్రస్తుతం 552 హెక్టార్లలో జీడిమామిడి తోటలు కొనసాగుతున్నాయి. అటవీ ప్రాంతం అభివృద్ధిలో ఎక్కడా నిర్లక్ష్యం జరగదు. అనుకూల పరిస్థితులను బట్టి తోటల పెంపుకు ప్రాధాన్యత క్రమం ఉంటుంది.

-బ్రహ్మయ్య, డివిజనల్ మేనేజర్, ఏపీఎఫ్‌డీసీ, సత్యవేడు డివిజన్

నేడు స్వీయచరిత్ర పుస్తకావిష్కరణ

– అందరూ తరలిరావాలని భూమన పిలుపు



తిరుపతి మంగళం: ప్రముఖ న్యాయవాది సీహెచ్. శివారెడ్డి రచించిన స్వీయచరిత్ర పుస్తకాన్ని శనివారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసం వద్ద ఆవిష్కరించనున్నట్లు తిరుపతి మాజీ ఎమ్మెల్యే, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. పుస్తక ఆవిష్కర్త డాక్టర్ హరగోపాల్, ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 52 ఏళ్ల క్రితం రాడికల్ ఉద్యమాల్లో ఎన్నో పోరాటాలు, అనుభవాలు పంచుకున్న గొప్ప అనుభవం శివారెడ్డితో తనకు ఉందని ఆ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. సమాజ శ్రేయస్సు కోసమే ఆయన అహర్నిశలూ శ్రమించారని, అలాంటి వ్యక్తి రచించిన పుస్తకావిష్కరణకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆగమోక్తంగా సంకట చతుర్థి పూజలు



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద శుక్రవారం ఆగమోక్తంగా సంకట చతుర్థి పూజలు చేశారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునే విధంగా ఈ పూజలను ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అంజి అంజి వినాయక స్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

రూ.22.75 లక్షలకు వ్యాపారి ఐపీ

తిరుపతి లీగల్ : రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ దేశమ్మ నగర్‌కు చెందిన నక్క చంద్రయ్య శుక్రవారం తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.22.75 లక్షలకు ఐపీ దాఖలు చేసినట్టు న్యాయవాది జి.తిరుమలరెడ్డి తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు.. చంద్రయ్య దేశమ్మ నగర్ సెంటర్‌లో 20 ఏళ్లుగా చీరల వ్యాపారంతోపాటు హోటల్, చీటీలు నిర్వహిస్తున్నాడు. రేణిగుంట పరిసర గ్రామాల్లోని వ్యక్తులు చీటీలో సభ్యులుగా చేరి సొమ్మును పాడుకున్నారు. తిరిగి సొమ్ము చెల్లించలేదు. దీంతో చంద్రయ్య వ్యాపారం కోసం కొంతమంది వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకున్నాడు. వ్యాపారంలో తీవ్ర నష్టాలు వచ్చాయి. ఈ క్రమంలో రుణ దాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఐపీ దాఖలు చేసినట్టు పిటిషన్‌లో పేర్కొన్నాడు. 13 మంది రుణదాతలను అతను ప్రతివాదులుగా పేర్కొన్నాడు.

హెల్మెట్ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్



కార్యక్రమంలో పాల్గొన్న రవాణాశాఖ అధికారులు, వాహనదారులు

తిరుపతి మంగళం: హెల్మెట్ లేని ప్రయాణం యమలోకానికి సోపానమని, హెల్మెట్‌ని బరువుగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ సూచించారు. మంగళంలోని తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. డ్రైవర్లకు, లైసెన్స్‌ల కోసం వచ్చిన వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీఓ మాట్లాడుతూ మోటర్ వాహనాల చట్టం 1988 సెక్షన్ 129 ప్రకారం ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు, అతని వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్‌ను ధరించాలన్నారు. వాహనదారులు చేసే తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. నిర్లక్ష్యం నిండుప్రాణాలను బలిగొంటుందన్నారు. అనంతరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐలు) సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్, స్వర్ణలత మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాల్ని పాటించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనివాసులు, విజయప్రశాంతి పాల్గొన్నారు.

సంక్రాంతి వీడ్కోలు

తిరుపతి అర్బన్: సంక్రాంతి పండుగ ముగిసింది. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వారు తిరిగి ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వెళుతున్న నేపథ్యంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రయాణికులతో రెండు రోజులుగా కిటకిటలాడుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందంటూ పలువురు వాపోతున్నారు. సంక్రాంతికి ప్రత్యేకంగా 200 సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు చెప్పినప్పటికీ అందులు 50శాతం సర్వీసులను అదనంగా అందుబాటులోకి తీసుకురాలేదంటున్నారు. ఈ క్రమంలో బస్సు వస్తే చాలు పరుగులు పెడుతూ ఎక్కేస్తున్నారు. క్షణాల్లో సర్వీస్ నిండిపోతోంది. దీంతో పలువురు ప్రయాణికులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉన్నా స్టాండింగ్ తప్పడంలేదు. మరోవైపు శుక్రవారం తిరుమలకు వెళ్లడానికి తిప్పలు తప్పలేదు. పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు చోటుచేసుకున్నాయి.



బస్టాండ్‌లోకి బస్సు వచ్చిన వెంటనే సీటు కోసం పాకులాడుతున్న ప్రయాణికులు

మందు కొట్టి డ్రైవింగ్ చేస్తే అంతే!

– 30మందికి రూ.3 లక్షల జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం సేవించి వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న కేసుల్లో 30 మందికి ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున మొత్తం రూ.3లక్షలు జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎన్వీ సుబ్బారెడ్డి తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు.

లారీ ఢీకొని ఆవు మృతి

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని గాంధీపార్కు వెనుక వెంకటగిరికి వెళ్లే రహదారిపై శుక్రవారం లారీ ఢీకొనడంతో ఆవు మృతి చెందింది. నాయుడుపేట వైపు నుంచి మేనకూరు వైపు వెళుతున్న లారీ రోడ్డు పక్కగా వెళుతున్న ఆవును ఢీకొంది. ఆవు టైర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఆవు ఎన్ఎస్ఆర్ కాలనీకి చెందిన మణిదిగా గుర్తించారు. పట్టణంలో ఆవులను వదిలిపెట్టవద్దని పలుమార్లు హెచ్చరికలు చేస్తున్నా యాజమానులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు.

చికిత్స పొందుతూ యువ రైతు దుర్మరణం



మృతి చెందిన శ్యామసుందర్

సైదాపురం: అప్పులు పాలు కావడంతో ఓ యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆస్పత్రిలో 23 రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచిన ఘటన మండలంలోని దేవరవేమూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం.. మండలంలోని దేవరవేమూరు గ్రామానికి చెందిన పరావస్తు శ్యామసుందర్(33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వారు. తనకున్న రెండెకరాల్లో సోయాబీన్స్ పంటను సాగు చేశారు. పంట చేతికి రాకపోవడంతో ఆ పంటకు తెచ్చిపెట్టిన రూ.2 లక్షల అప్పును ఎలా తీర్చాలని మనస్తాపానికి గురయ్యారు. గత ఏడాది డిసెంబర్ 24వ తేదీ ఇంట్లో ఉన్న పరుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్యామసుందర్ శుక్రవారం మృతి చెందారు. ఈ విషయమై నెల్లూరు ఆస్పత్రి వైద్యులు పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. మృతునికి భార్య రేవతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి..



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ప్రధాన మురుగు కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు శుక్రవారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కాలువ గోడ మీద పడుకుని ప్రమాద వశాత్తు జారి కాలువలో పడిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అతనికి సుమారు 40 ఏళ్లు ఉంటాయని, నలుపు రంగు ప్యాంటు, పాచి కలర్ షర్టు ధరించినట్టు పేర్కొన్నారు. అతని వద్ద ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్టు పేర్కొన్నారు.

ముగ్గురు ముద్దాయిలకు యావజ్జీవం

కేవీబీపురం (వరదయ్యపాళెం): అక్రమ సంబంధంలో తమకు అడ్డుతగులుతున్నారనే కారణంతో ఓ వ్యక్తిని హతమార్చిన కేసులో ముగ్గురు ముద్దాయిలకు యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ శ్రీకాళహస్తి 12వ జిల్లా కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. ఆ మేరకు కేవీబీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఈ తీర్పు వెలువడినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి 2017 డిసెంబర్ 31న కేవీబీపురం పోలీస్ స్టేషన్‌లో బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన మేరకు కేసు నమోదైంది. కేవీబీపురం మండలం, మతం గ్రామానికి చెందిన నల్లప్పగిరి గంగరాజు అదే గ్రామంలో హత్యకు గురైన పల్లమాల కుప్పయ్యకు చెందిన రెండో కోడలి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఈ విషయాన్ని గమనించిన పి.కుప్పయ్య అతన్ని మందలించాడు. అయితే తమ అక్రమ సంబంధ ప్రయత్నానికి అడ్డు తగులుతున్నారన్న కక్షతో మామ పల్లమాల కుప్పయ్యను హతమార్చేందుకు పన్నాగం పన్నాడు. వృత్తి రీత్యా కుప్పయ్య మేకల వ్యాపారం ద్వారా వారం వారం మాంసం విక్రయించేవాడు. అందులో భాగంగా 2017 డిసెంబర్ 30న రాత్రి 7.30 గంటల సమయంలో ఓ వ్యక్తి ద్వారా ఫోన్ రావడంతో పి.కుప్పయ్య సమీపంలోని ఓ పరిశ్రమ వద్దకు వ్యాపార రీత్యా మాట్లాడేందుకు రమ్మనడంతో అక్కడకు వెళ్లాడు. అనంతరం పెరిందేశం గ్రామానికి చెందిన ఏ.లోకేష్, వీ.రాజ మాటామంతి మాట్లాడుతూ పల్లమాల కుప్పయ్యకు మద్యం సేవింపజేశారు. పూర్తిగా మత్తులోకి చేరుకోవడంతో అక్కడ సమీపంలో తలదాచుకుని ఉన్న నల్లప్పగిరి గంగరాజు వెనుక నుంచి వచ్చి పల్లమాల కుప్పయ్య తలపై రాడ్‌తో బలంగా మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సైతం సమీపంలోని నాగూర్ రెడ్డి బీడు భూముల్లో పడేసి వెళ్లారు. మృతుని మొదటి కుమారుడు పల్లమాల బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడ లభించిన ఆధారాలతో విచారణ చేపట్టి పక్కా ఆధారాలతో కోర్టుకు సమర్పించారు. దీంతో శుక్రవారం శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా కోర్టులో విచారణకు రాగా విచారణలో ఏ1 ముద్దాయిగా మతం గ్రామానికి చెందిన నల్లప్పగిరి గంగరాజు, పెరిందేశం దళితవాడకు చెందిన వెట్టి రాజ, అదే గ్రామానికి చెందిన అక్కుపల్లి లోకేష్‌ను ముద్దాయిలుగా నిర్ధారించారు. వీరికి యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎం.శ్రీనివాసులు నాయక్ తీర్పునిచ్చారు. అలాగే ఒక్కో ముద్దాయికి రూ.12వేలు చొప్పున జరిమానా విధించారు.

అశ్రుదారి!



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు



శ్రీవారి ఆలయం వద్ద జీవ చివరి ఫొటో



ప్రశాంత్ (ఫైల్)

చిత్తూరు అర్బన్/చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర శివారుల్లోని గాజులపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణంగా నిర్ధారణ అయ్యింది. రోడ్డు పనులు చేస్తున్న ప్రైవేటు కంపెనీ నిర్వాహకుల తప్పిదం వల్లే నలుగురు మృత్యువాత పడ్డారు. సర్వీసు రోడ్డు నుంచి గ్రావెల్ మట్టి తరలిస్తున్న టిప్పర్, యూ టర్న్ తీసుకుని అవతలి వైపునకు వెళ్లాల్సి ఉంది. కానీ టిప్పర్ డ్రైవర్ రాత్రి వేళల్లో రోడ్డుకు అడ్డుగా ఉంచిన దిమ్మెలు తొలగించి, రాంగ్ రూట్‌లో తిరుగుతుంటాడు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి టిప్పర్ రాంగ్ రూట్‌లో జాతీయ రహదారిపైకి వచ్చి, బస్సును ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పిన బస్సు, అక్కడే ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని రాసుకుంటూ 20 మీటర్ల దూరంలో ఎగిరి బోల్తా పడింది. ఈ ఘటనలో క్షతగాత్రులను అధికారులు వేలూరులోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి, చికిత్స అందిస్తున్నారు.

ఆదమరచి నిద్రిస్తున్న వేళ..

తిరుపతి-మధురై మధ్య రోజూ తమిళనాడుకు చెందిన ఓ ట్రావెల్స్ స్లీపర్ క్లాస్ బస్సు నడుస్తోంది. రాత్రి 9.45 గంటలకు తిరుపతిలో బయలుదేరిన బస్సు శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మధురై చేరుకోవాల్సి ఉంది. రాత్రి 11.30 గంటల మధ్య చిత్తూరు నగరాన్ని దాటుకున్న బస్సు.. వేలూరు రోడ్డులోని గాజులపల్లె వైపు వెళుతోంది. మొత్తం 26 మంది ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండగా, దాదాపు వంద కిలోమీటర్ల వేగంతో బస్సు వెళుతోంది. అదే సమయంలో యాదమరి వైపు నుంచి గ్రావెల్ మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్ బస్సును మధ్య భాగంలో ఢీ కొట్టింది. బస్సు వేగానికి టిప్పర్ ఢీ కొట్టడంతో.. డ్రైవర్‌కు ఎడమ వైపున బస్సు పడిపోయింది. ప్రమాదం జరిగిన అర్ధగంట తరువాత భారీ క్రేన్ సాయంతో బస్సును పైకిలేపి నిలబెట్టారు. బస్సులో గాయపడిన వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గమ్యం చేరకనే తిరిగిరాని లోకాలకు..

కాగా ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 22 మంది గాయపడ్డారు. మృతుల్లో తిరుపతి సప్తగిరి నగర్‌కు చెందిన ముత్తు విజయ్‌రాజు కుమారుడు ఎం.పాన్‌చంద్రు (33), ఎన్‌జీఓ కాలనీకి చెందిన శ్రీకాంత్ కుమారుడు కె.శ్రీధర్ (21), తమిళనాడులోని కుంభకోణం నగరానికి చెందిన ఏజీ.ప్రశాంత్ (43), కన్యాకుమారికి చెందిన జీవ (40) ఉన్నారు. వీరిలో తిరుపతికి చెందిన పాన్‌చంద్రు టైర్ల దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. తన తల్లి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెకు మధురైలోని ఆస్పత్రిలో చికిత్స చేయించడానికి బస్సులో బయలుదేరాడు. 'రాత్రి నిద్రలో ఉండగా పెద్ద శబ్దం వచ్చింది. లేచి చూసేసరికి అంతా చీకటి.. అరుపులు.. కళ్లు తిరిగిపడిపోయాను. ఉదయం నా కొడుకు చనిపోయినాడు అని చెప్పారు. మేమేమీ పాపం చేశాం..'' అంటూ పాన్‌చంద్రు తల్లి సెల్వసుందరి కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీధర్ తంజావూరులోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో బీ.టెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతని తండ్రి శ్రీకాంత్.. తిరుపతిలోని ఆదాయపన్నుశాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. దశరా సెలవులకు వచ్చిన శ్రీధర్, తిరిగి కళాశాలకు వెళుతూ మృత్యువాత పడ్డాడు. ఇక తమిళనాడుకు చెందిన జీవ, ప్రశాంత్ ఇద్దరూ పదేళ్లుగా స్నేహితులు. తరచూ కలుస్తుండేవాళ్లు. గురువారం కాలినడకన తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని.. ఇంటికి బయలుదేరుతున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు. ఇద్దరికీ పెళ్లయ్యి పిల్లలున్నారు. కాగా మృతదేహాలన్నింటికీ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.